

# ఒప్పులకుప్ప

శ్రీ తెన్నేటి సూరి, బి., ఏ.

ప్రశాంతంగా వుంది, బౌద్ధవిహారం—చుట్టూ బౌద్ధ భిక్షువుల చలువరాతి విగ్రహాలు-విహారానికి మధ్యగా గౌతమదేవుని ప్రతిమ ఒకటేవుంది, లెక్కన వాటన్నింటికంటే చాలాపెద్దది. ఆ విగ్రహం ముఖంలో గౌతమదేవుని నిర్మల హృదయాన్ని చిత్రించేటందుకు శిల్పి తన యావత్తు ప్రతిభనూ వినియోగించినట్లుగా తోస్తుంది. ఆ శిలా ప్రతిమకు ఇరువైపులా రెండు జ్యోతులు నిలిచి వెలుగుతున్నాయి, అచలనంగా.

గౌతమ దేవులకు ముఖాముఖి, కరుణానంద భిక్షువు తివాచీమీద కూర్చుని చదువుకుంటున్నాడు తనలో తాను నిశ్శబ్దంగా. ఆయనకు కొంచెం దూరంలో దేవదత్త--ఎనిమిది సంవత్సరాల బాలిక—కూర్చుని చదువుకుంటూ వుంది. తను చదివేదేమిటో తనకే అర్థం కాకపోయినా బిగ్గర బిగ్గరగా చదువుతూవుంది, గంట గొట్టినట్టుగా మధ్యమధ్య చదువాపి కరుణానంద భిక్షువును ఏదో అడుగబోతూంది. ధైర్యంచాలక మళ్లా తలవంచుకు గణగణా చదువుతోంది.

చిటపట, చిటపట,
చినుకులుపడితే,
పసిరిక పదుకుంది;
కన్నులవెంటా,
కరుణ ఒలికితే,
జగతి పెరుగుతుందీ—
చిటపట, చిటపట,
చిటపట, చిటపట—

చదువాపి—"బాబా!" అంది, దేవదత్త. "ఆ!," అన్నాడు కరుణానంద భిక్షువు, నెమ్మదిగాతలెత్తి. బిడ్డ వంకచూస్తూ.

"మానాన్నగారు ఎవరూ?"

"అదేమిటీ! నేనే"

బిడ్డ తలవంచుకుని పుస్తకంలోచూచి-

సంక్షోభ పెట్టకీ హింసనేపడలేను
ప్రాణాలు తీసుకో బాధ లేనేలేను,

"మరి మాఅమ్మో?" అంది దేవదత్త, చివాల్న తలెత్తి.

భిక్షువు బాగా విస్ఫురితుడైనాడు. "అదేమిటే అమ్మడూ? ఇలారా" అంటూ ఒళ్ళోకి తీసుకున్నాడు. కొనగోట శిరోజాల్ని నిమురుతూ, "అదేమిటేఅమ్మా! అలా అడిగావు ఈవేళ? అమ్మా నేనే-నాన్నా నేనే. ఎందుకు అలా అడిగావు, ముద్దులుగులికే నీచిరుముఖం అలా చిన్నబోయిందేం, ఈవేళ, సాయంత్రంనుంచీ చూస్తాను?"

"అమ్మంటే ఆడవాళ్ళుగా?"

"అదా! నువ్వు తక్కిన అందరు పిల్లలకిమల్లే కాదమ్మా! నేను గౌతమ దేవులను ప్రార్థించుకుంటూ వుంటేను, గురుదేవులు నిన్ను నా కిచ్చారు, ప్రసాదంగా."

"ఆ! అబద్ధం."

"బౌద్ధ భిక్షువు అబద్ధ మాడతాడా? అలా అనవచ్చునా?"

"తప్పుచేశాను; క్షమించండి" అని తన చిరు చేతులెత్తి లెంపలు వేసుకుంది, దేవదత్త.

"అమ్మా గౌతమదేవులు నీకురక్ష; గురు దేవులకు నమస్కరించు"

సాష్టాంగంచేసి "నమో శ్రీ బుద్ధాయ" అంది దేవదత్త. "జేయ్ శ్రీ బుద్ధాయ" అన్నాడు కరుణానందుడు. "జయ్ శ్రీ బుద్ధాయ" అని ప్రతిధ్వనించినాయి విహార శిలలన్నీకూడా.

"అమ్మా, నిద్ర నీ లేతకళ్ళమీద బరువులెత్తుతూంది. వెళ్లిపడుకో" అన్నాడు, భిక్షువు. దేవదత్త, దూరంగా వున్న పక్కవైపు నాల్గడుగులు వేసింది. చటుక్కున ఆగి క్షణం ఏమో యోజించింది. గిరుక్కున వెనక్కుతిరికి గరచరావచ్చి కరుణానందుడు వీపుమీద పడుకుంది. క్రౌందమ్మితూండ్లలాంటి ఆముం చేతులతో అతని కంఠాన్ని కౌగలించుకొని మారాం చేస్తూ.........

"రేపటినుంచీ మీరు నాతో ఆడుకోవాలి, ఆడుకోటానికి ఇక వీధిలోకి వెళ్లను."

"సరే ఆజ్ఞ, అలాగే ఆడుకుంటానులే, ఏం? వీధిలోకి ఎందుకు వెళ్లవ్?"

"వాళ్లు నాతో ఆడకూడదంటుంటేనే?"

"ఏం?"

"ఏమో, ఏమిటో...'అబ్బలేని బిడ్డ' అంటారు నన్ను"

"ఓహో, ఇదెప్పటి నుంచి?"

"ఎప్పటినుంచేమిటీ రోజూనూ, ఇవాళ మరీ రాద్ధాంతం"

"ఏం జరిగిం దేమిటి?"

"వీధిలో పెద్ద వేపచెట్టుందే, దాని క్రింద పిల్లలంతా 'ఒప్పులకుప్ప' ఆడుకుంటున్నారు. బాబా! జమిందారుగారి పాపాయి ఆ చెట్టు మొదట్లో, చేతులు కట్టుకు నుంచుని వాళ్లవంక చూస్తున్నాడు. జమిందారుగారి పాపాయి ఎంచక్కా వుంటాడు కాదు బాబా!"

"అవును, చక్కగానే వుంటాడు- తరువాతేంజరిగింది?"

"ఆ! తరువాత, నేను గెంతుకుంటూ ఆ పాపాయి దగ్గిరికి వెళ్లాను. అతని రెండు చేతులూ పట్టుకొని 'ఇలా ఇలా 'వూపుతూ ఒప్పులకుప్పా!' అన్నాను. ఆపాపాయికూడా నా చేతులు పట్టుకుని 'వయ్యారిభామా' అంటూ గిరిగిరా తిప్పి వేస్తున్నాడు...... అబ్బా! ఎంతో హాయిగావుంది బాబా! అప్పుడు..."

"సరి, తరువాత?"

"ఆ! ఇంతట్లోకే ఎక్కడ్డో శనిపీనుగులాగు, శాస్త్రిగారబ్బాయి, ఆ పిలకవాణ్ణి చూశ్చేదు బాబా నువ్వు...వాడు పరుగెసుకుంటూ మాదగ్గరికి వచ్చాడు. వచ్చి, జమీందారుగారి అబ్బాయితో 'ఛట్! దాన్ని వదిలేసేయ్! అబ్బలేని బిడ్డ అది. దాన్ని ముట్టుకున్నావంటే మీ అమ్మతోచెప్పి డొక్క చీలిపిస్తా" నన్నాడు ఆ పాపాయి నెమ్మదిగా నా చేతులు జారవిడుస్తున్నాడు

నేను గట్టిగా పట్టుకుని, 'నాకు తండ్రిలేక పోవట మేమిటి? కరుణానంద భిక్షువు మా బాబయ్య;' అన్నాను."

"అవును, వాళ్ళేమన్నారు మరిదానికి"

"ఆపళంగా శాస్త్రిగారి అబ్బాయి తనేదో జయించి ఘనకార్యం చేసినవాడిలాగూనూ, నేనేదో తప్పుపనిచేసిన దానిలాగూ విరగబడి నవ్వుతూ ఆ పిల్లల్ని జల్లల్ని అందర్ని కేకవేసి "ఒరేయ్! కరుణానంద భిక్షువు దీని బాబుట్రోయ్," అన్నాడు. ఆ పిల్లలంతా కూడా ఈ మాటవిని ఒకటే పకాపికా...ఆ ఎదురుగావున్న శివాలయ గోపురంలోనుంచి కూడా పెద్దపెట్టున ఎవ్వరో నన్ను నవ్వారు బాబా!"

"అక్కడ ఎవ్వరూ లేరులే అమ్మా! ఆ శివాలయ గోపురమే ఈ పిల్లల నవ్వు నలా ప్రతిధ్వనించింది. అలా చేస్తుందిలే....ఆ పాపాయి నిన్ను వదిలేసి వెళ్ళిపోయాడా?"

"ఆ! నెమ్మదిగా నా చేతులు జారవిడుస్తున్నాడు. 'నాతో ఆడుకోవూ?' అని ఎంతో యిదిగా బ్రతిమలాడాను బాబా......పాపం, ఆ పాపాయి ముఖం చిన్నబుచ్చుకుని 'మా వాళ్ళు కోప్పడతారు' అని నెమ్మదిగా ఇంటికి వెళ్ళిపోయాడు.

"ఓసీ! దీనికేనా! ముఖం ముడుచుకుని సాయంత్రంనుంచీ చిన్నబోయి కూర్చున్నావు?...రేపు వుదయంనుంచి ఆ పాపాయి మన విహారంలో చదువుకునేందుకు వస్తాడు."

"జమిందారుగారు ఇందాక ఇక్కడికివచ్చి, 'పాపాయిని పంపుతాను, జాగ్రత్త చెయ్యండి' అని చెప్పి వెళ్ళాడు—ఆ పాపాయి వచ్చేదాకా ఈ పాపాయితో ఆడుకో," అని పెద్ద చందనపు బొమ్మనిచ్చాడు. "పోయి పడుకో, చాలా ప్రొద్దుపోయింది... ఈ పాపాయిని కూడా చిచ్చికొట్టి నిద్దరూపు."

కిటికీ ప్రక్కను వేసివున్న పక్కమీద పోయి పడుకుంది, దేవదత్త, ఆ చందనపు బొమ్మను చిచ్చిగొడుతూ.

నిద్రబో అబ్బాయి
నిద్ర బోవోయీ
నిద్ర కన్యకలొచ్చి
నిన్ను లేపేరూ......

దేవదత్త నెమ్మదిగా కన్ను మూసింది......తోటలోవున్న లేరాణిని పోకిరీతనంగా రాసుకుంటూ వచ్చిన ఒక గాలి పిల్లడు కిటికీగుండా లోపల ప్రవేశించి, దేవదత్త ముంగురులని, కదిలించి వేళాకోళాలాడుతున్నాడు.

ఒక కిరణం చంద్రుడునుంచి బయలుదేరి ఆ బిడ్డ బుగ్గమీద పడ్డది కిటికీగుండా.

